


శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఓం

శ్రీ జగద్గురు శంకరాచార్య విరచిత

భజగోవిందము



వ్యాఖ్యాత

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు





ఓం

శ్రీ జగద్గురు శంకరాచార్య విరచిత

భజగోవిందము

వ్యాఖ్యాత :

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ప్రకాశకులు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము

శ్రీ కాళహస్తి -517 640

2004

ప్రథమ ముద్రణ - 2004 సం॥   2000 ప్రతులు

వెల :

ప్రతులకు : మేనేజరు, శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ శుకబ్రహ్మాశ్రమ రోడ్డు
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీ కాళహస్తి -517 640 , చిత్తూరు జిల్లా, (ఆం.ప్ర)
ఫోన్ : 08578-222239

డి.టి.పి. : శ్రీ అసంగానంద గ్రాఫిక్స్, శ్రీ వ్యాసాశ్రమము
ఏర్పేడు, ఫోన్ : 08578-287528

ముద్రణ : శ్రీ పారాశర్య ప్రెస్, శ్రీ వ్యాసాశ్రమము
ఏర్పేడు, ఫోన్ : 08578-287528

ప్రకాశకుల మాట

శ్రీ జగద్గురు శంకరాచార్యులవారు ప్రస్థాన త్రయాలకు భాష్యం వ్రాసి అద్వైతమతానికి ఒక వ్యవస్థను కల్పించారు. ఆచార్యులవారు జ్ఞానయోగానికి ప్రాధాన్యమిచ్చి "జ్ఞానమే మోక్షసాధనము" అనినా, భక్తిని కూడా ఆదరించారు. భక్తిని పరమ్పరాసాధనంగా తెలిపారు. కాబట్టి వారు భక్తిపరంగా అనేక స్తోత్రాలను కూడ రచించారు. అనేక ప్రకరణ గ్రంథాలనుకూడ రచించారు.

ఆచార్యులవారు ఒకనాడు కాశీలో ఒక వృద్ధ పణ్డితుడు వ్యాకరణసూత్రాలను వల్లెవేస్తూండడం చూచి ఆశ్చర్యచకితుడై ఆ వృద్ధుని హెచ్చరిస్తూ ఓ మూఢమతీ! కాటికి కాళ్లు చాచిన నీకు మరణసమయంలో ఈ వ్యాకరణ సూత్రాలు ముక్తిని కలుగజేయలేవు. ఈ అవసానదశలో దీన్ని వదలి గోవిందుని-భగవంతుని భజించవయ్యా! అంటూ "భజగోవిందం, భజగోవిందం గోవిందం భజ మూఢమతే!" అనే మకుటంతో హెచ్చరించారు. "మోహముద్గరం" అని ఈ శ్లోకాలు ప్రసిద్ధి చెందాయి. జగత్తుయొక్క నశ్వరత్వాన్ని తెలుపుతూ అవసర మొచ్చినపుడు నీవు 'నావి' అని కౌగలించుకొనుచున్న ధనం, భార్య, పిల్లలు, ఆస్తిపాస్తులు మరణ సమయంలో నీ వెంటరావు. నిన్ను ఉద్ధరించవు. భగవంతుడొకడే సత్యము, నిత్యము.

అందుచేత అతణ్ణి భజించు! అంటూ వివరిస్తూ శ్లోకాల రచన చేశారు. ఈ రచన లోకంలో "భజగోవిందం" గా ప్రసిద్ధి చెందినది. లోకంలో బహుళప్రచారాన్ని పొందినది. ఇందు ఆచార్యులవారు కొన్ని రచిస్తే, శిష్యులు కొన్నింటిని రచించారు.

ఇట్టి ఆచార్యులవారి లోకప్రియరచన "భజగోవిందా"న్ని శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు పరమహంస పరివ్రాజకాచార్యులు గురుదేవులు పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములారు శ్లోకం, తాత్పర్యం తమ లఘువ్యాఖ్యతో వేదాన్తభేరిలో క్రమంగా ప్రచురించారు. వానినే భక్తుల సౌకర్యార్థం ఈ గ్రంథరూపంలో ఇపుడు ప్రకటిస్తున్నాము. పాఠకులు దీనిని ఆదరింతురుగాక! దీనిని చదివి కనువిప్పు గలిగి తమ జీవితాలనుకూడ దైవమయం, శాన్తిమయం చేసుకొందురు గాక!

ఓమ్

వినాయక చవితి --- స్వామి విద్యాస్వరూపానన్ద

18-8-2004

భజగోవిందము

భజ గోవిన్దం భజ గోవిన్దం
గోవిన్దం భజ మూఢమతే,
సంప్రాప్తే సన్నిహితే కాలే
న హి న హి రక్షతి డుకృఞ్ కరణే 1

తా॥ ఓయీ! వృద్ధుడా! మరణకాలము సమీపించగా నీవు వల్లించు 'డుకృఞ్ కరణే' అనువ్యాకరణ సూత్రము నిన్నురక్షింపజాలదు. కావున గోవిందుని మఱల మఱల భజించుము. బుద్ధిమంతుడవై మెలగుము.

వ్యాఖ్య :- పూర్వము శంకరాచార్యులవారు శిష్యసమేతముగా కాశీపట్టణమున గంగాస్నానమునకై పోవుచుండ త్రోవలో నొక వృద్ధ విప్రుడు వ్యాకరణ సూత్రములను వల్లించుచుండగా, అతనినుద్ధరింపదలంచి ఈ భజగోవింద శ్లోకములను అతనికి చెప్పిరి.

తదుపరి శంకరుల శిష్యులుకూడ కొన్ని శ్లోకములను చెప్పిరి. మహోన్నత భావములతో గూడిన ఆ వాక్యములను విని విప్రుడాప్రకారమే ఆచరించి తరించెను. ఈ ప్రపంచమున గల ధనధాన్యాది సంపదలుకాని, లౌకిక విద్యలుకాని అంత్య కాలమున జీవుని రక్షించలేవు. భగవద్భక్తి, ఆత్మజ్ఞానము మాత్రమే అతనిని కాపాడగలవు. కావున సమయమును వ్యర్థము చేయక భగవంతుని భజించుట శ్రేయస్కరము.

మూఢ జహీహి ధనాగమతృష్ణాం
కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్,
యల్లభసే నిజకర్మోపాత్తం
విత్తం తేన వినోదయచిత్తమ్. ౨

తా॥ ధనమును సంపాదించుటయందలి ఆశను వదలుము. ఆశారహితమగు సద్బుద్ధిని మనంబున కలుగజేసి కొనుము. నీ పూర్వకర్మ ఫలితముగ ఎంత ధనము నీకు లభించునో దానితోనే తృప్తినొంది యుండుము. అజ్ఞానమును పారద్రోలుము.

వ్యాఖ్య :- ప్రాపంచిక వస్తువులగు ధనాదులనుగూర్చిన ఆశ ఆధ్యాత్మిక పురోగమనమునకు చాల ప్రతిబంధకమైనది. కావున ముముక్షువులు దానిని త్యజించవలెను. ఉన్నదానితో, లేక లభించిన దానితో తృప్తిపడవలెను. ఆశకొలది లక్షలు ఆర్జించినను, కోటికిపడగెత్తినను ఒక్క చిల్లిగవ్వ అయినను అంత్యకాలమున వెంటరాదు. పైగా దానిని సంపాదించుటలో అవలంబించు వక్రమార్గములచే పాపమును మూటకట్టుకొన వలసివచ్చును. భగవద్ధ్యానమునకు సమయమున్ను మిగులదు. కాబట్టి ధనాదుల తృష్ణను విడనాడి లభించినదానితో తృప్తినొంది యుండుట ఉత్తమము.

నారీస్తనభర నాభీదేశం
దృష్ట్వా మాగా మోహావేశమ్,
ఏతన్మాంస వసాదివికారం
మనసి విచిన్తయ వారం వారమ్. ౩

తా॥ స్త్రీలయొక్క స్తనములను, నాభి ప్రదేశమును చూచి మోహమును పొందకుము. అవి మాంసము, క్రొవ్వు మొదలగు పదార్థములయొక్క వికారరూపములేయని మనస్సునందు మాటి మాటికి చింతన చేయుము.

వ్యాఖ్య :- శరీరము పంచభూతములగు పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములయొక్కసమ్మేళనమే యగును. అది జడమైనది. వికారభూయిష్ఠమైనది. రక్తమాంసాదిదుర్గంధ పదార్థము లతో గూడినది. కావున శరీరమున అందముకలదని భావించుట, దానిని చూచి మోహపరవశుడగుట అవివేకమే యగును. వివేకము కలవాడు శరీరమును చూచినంతనే అది ఏయే పదార్థములచే ఏర్పడినది, దాని లోపల గల వస్తువు లెవ్వి? అని వెంటనే విచారణ సలిపి మోహమునకు అవకాశమే లేకుండ చేయవలెను. ఈ ప్రకారముగ వస్తుతత్త్వవిచారణను మరల మరల గావించి బహుజన్మార్జిత ప్రాపంచిక వాసనను దూరీకరించుకొనవలెనని శ్రీ శంకరాచార్యులు ఉద్బోధించుచున్నారు.

నళినీదళగత జలమతి తరళం
తద్వజ్జీవిత మతిశయ చపలమ్,
విద్ధి వ్యాధ్యభిమాన గ్రస్తం
లోకం శోకహతం చ సమస్తమ్. **4**

తా॥ తామరాకుపై పడిననీరు ఎట్లు చపలముగ నుండునో, అట్లే ప్రాణికోట్లయొక్క జీవితము మహాచపల మైనది. ప్రపంచమున జనులు రోగములు, అభిమానము మున్నగు వానితో గూడినవారై దుఃఖముతో సతమత మగుచున్నారు.

వ్యాఖ్య :- జీవితము నీటిబుడగవలె క్షణభంగురమైనది. తామరాకుపైపడిన నీటివలె అది మిగుల చపలమైనది. కాని అజ్ఞాన వశమున జనులు అది శాశ్వతమైనదని భావించి దృశ్యపదార్థములనే నమ్ముకొని వానివెంట అహర్నిశములు పరుగిడుచున్నారు. ఆత్మ శాశ్వతమైనది. శరీరము అశాశ్వత మైనది. కావున ఆత్మనే నమ్ముకొని అద్దాని సాక్షాత్కారము కొఱకై శాయశక్తులా ప్రయత్నించవలెను. శరీరాది దృశ్యపదార్థములు శాశ్వతములని తలంచుటవలనను, వానిపై అభిమానము కలిగియుండుటవలనను, జనులు శోకపీడితులగుచున్నారు. కావున ఆనందము నభిలషించువారు దేహాభిమానమును త్యజించి ఆత్మానుభూతికై భక్తి, జ్ఞాన, వైరాగ్యాదులను సంపాదించవలెను.

యావద్విత్తోపార్జనసక్తః
తావన్నిజపరివారో రక్తః
పశ్చాజ్జీవతి జర్జరదేహే
వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే **5**

తా॥ మానవుడు ఎంతవఱకు ధనమును సంపాదింప గలిగియుండునో, అంతవఱకు అతని కుటుంబమువారు, బంధువులు ఆతనిపై ప్రేమ గలిగియుందురు. తదుపరి వార్ధక్యము దాపురించుటవలన ధనార్జనయందు శక్తి లేనివాడగుటచే అత్తఱి ఎవడును అతని వృత్తాంతమును గూర్చి విచారింపడు.

వ్యాఖ్య :- ఒక వ్యక్తి తనపై తన కుటుంబమువారు కాని, బంధువులుకాని, తదితరులు కాని ఆదరాభిమానము ఎల్లప్పుడు కలిగియుందురని తలంచుట సరికాదు. కొందరు కొన్ని పరిస్థితులలో కొన్నికారణములవలన ప్రేమ, ఆదరణ కలిగి యుండ వచ్చును. కాని, పరిస్థితులు తారుమారైనప్పుడు అట్టి ప్రేమ, ఆదరణలను నిలబెట్టుకొనువారు లోకములో చాలఅరుదు. భగవంతుని ఆదరణ ఒకటియే శాశ్వతమైనది. భగవానుడు దయామయుడు, కరుణామూర్తి. కావున సర్వేశ్వరుని యెడల అచంచలమైన విశ్వాసముంచి, దేహాదులయెడల తత్సంబంధమైన ప్రాపంచిక పదార్థములయెడల, వ్యక్తులయెడల మమత్వమును, అభిమానమును పారద్రోలి జీవితమును పవిత్రవంతముగ నొనర్చుకొనవలెను.

యావత్పవనో నివసతి దేహే
తావత్పృచ్ఛతి కుశలం గేహే,
గతవతి వాయౌ దేహాపాయే
భార్యా బిభ్యతి తస్మిన్కాయే. 6

తా॥ ఎంతవఱకు దేహమందు ప్రాణవాయువు ఉండునో, అంతవరకు అందఱును అతని క్షేమసమాచారములనుగూర్చి ప్రశ్నించుచుందురు. ఆ కొంచెము ప్రాణము లేచిపోయినప్పుడు ఆ మృతదేహమును గాంచి భార్యకూడ భయపడును. అత్తఱి ఎవరును దగ్గఱకు చేరరు.

వ్యాఖ్య :- ప్రాణమున్నంతవఱకే ఈ శరీరమునకు గౌరవము. అది పోయినప్పుడు దేహము కట్టెతో సమానమై, దుర్గంధ భూయిష్టమై ఎంతత్వరగా వదలిపోయిన అతమంచిదని భావము కలిగించుచుందును. శరీరముయొక్క అట్టి క్షణికత్వమును జనులు బాగుగ గుర్తెఱింగి, దానినే నమ్ముకొనక, దానిపై మమత్వమును, అభిమానమును వదిలివైచి ఆత్మయే తన నిజస్వరూపమని విశ్వసించి అట్టి స్వస్వరూపాత్మను జీవితాంతములోగానే సాక్షాత్కరించుకొనుటకై యత్నించవలెను. అశాశ్వత పదార్థములపై వ్యామోహమును విడనాడి శాశ్వత పరమాత్మనే నమ్ముకొని, అట్టి హృదయస్థ పరమాత్మయొక్క అనుభూతిని ఈ మానవజన్మయందు బడయవలెను.

అర్థమనర్థం భావయ నిత్యం
నాస్తి తతస్సుఖ లేశస్సత్యమ్
పుత్త్రాదపి ధనభాజాం భీతిః
సర్వత్రైషా విహితా రీతిః. 7

తా॥ ధనము అనర్థమును కలుగజేయుననియు, ఆధ్యాత్మిక ప్రయోజనము లేనిదనియు ఎల్లప్పుడు భావించుము. ఆ ధనమువలన కొంచెమైనను పారమార్థిక సుఖము లేదు. ఈ విషయము ముమ్మాటికిని సత్యము. ధనవంతులకు తమ పుత్రులవలనకూడ భయము కలుగుచుండును. ఈ పద్ధతి లోకమందంతటను ఒకే విధముగ నున్నది.

వ్యాఖ్య :- ధనమును ఆర్జించుటయందును దానిని రక్షించుటయందును, దానియొక్క వినాశమందును మనుజుడు పలుక్లేశములను బొందుచున్నాడు. కనుకనే అది అనర్థమనియు, ఆధ్యాత్మిక ప్రయోజనం లేనిదనియు చెప్పబడెను. ఈ సత్యమును ముముక్షువు సదా జ్ఞప్తియందుంచుకొని ధనాదులపై వ్యామోహమును వదలి, అమూల్యమైన మానవజీవితమును దైవప్రాప్తి కొఱకు వినియోగించవలెను. ధనవంతులకు తమ కుమారులను చూచినను భయము కలుగుచుండును. కాబట్టి ధనాదులు భయజనకములై, ఆత్మశాంతికి భంగకరములైయుండునని మఱువరాదు.

బాల స్తావత్క్రీడాసక్తః
తరుణ స్తావ త్తరుణీసక్తః
వృద్ధ స్తావచ్చిన్తా సక్తః
పరమే బ్రహ్మణి కో౽ పి న సక్తః. **8**

తా॥ మనుజునకు బాల్యకాలము ఆటలయందు గడచి పోవుచున్నది. యౌవనము వనితాది విషయములందు గడచు చున్నది. వార్ధక్యమో అనేక చింతలతో గడిచి పోవుచున్నది. ఇక పరబ్రహ్మమునందు ఆసక్తికలవాడెవడును లేడు. (అట్టి వారు అరుదని భావము).

వ్యాఖ్య :- పరమాత్మను తెలిసికొనుటకు, తన నిజ స్వరూప మైన బ్రహ్మమునందు నిలకడ గలిగి తరించుటకు మానవ జన్మ యేర్పడినది. కాని అమూల్యమైన మానవ జీవితకాలమును జనులు వ్యర్థముగ గడిపివేయుచున్నారు. చిన్నపుడు ఆటల యందును, పెద్దైన తరువాత వనితాది విషయములందును, ముసలితనము చింతలందును గడిచిపోవుచున్నది. అంతియే కాని పరమాత్మనుగూర్చి ధ్యానించు వారు, దైవమును తెలిసికొనవలెనను కుతూహలము కలవారు చాల అరుదుగా నున్నారు. కావున జనులు తమ కర్తవ్యమును గుర్తెఱింగి, దృశ్య విషయములందు కాలమును వృథాజేయక, ఆత్మానుభూతికై యత్నించి అద్దానిని బడసి పరమశాంతినొందవలెను.

కా తే కాన్తా కస్తే పుత్త్రః
సంసారో౽ యమతీవ విచిత్రః
క స్య త్వం వా కుత ఆయాతః
తత్త్వం చిన్తయ తదిహ భ్రాతః. * **9**

తా॥ నీభార్య ఎవరు? కొడుకు ఎవరు? వారికి నీకు ఏమి సంబంధము? ఈ సంసారము చాలా విచిత్రముగనున్నది. సోదరా! నీవు ఎవరివాడవు? ఎచటనుండి వచ్చినావు? దీని తత్త్వమును బాగుగ విచారించి తెలిసికొనుము.

వ్యాఖ్య :- వివాహము కాకపూర్వము భార్యఎవరో, పుట్టు కకు పూర్వము పుత్రుడెవడో! సంసారమందలి ఈ కుటుంబ కలయికలు, బంధు మిత్రాదుల కలయికలు చాల విచిత్రముగ నున్నవి. జీవుడు ఎచటినుండివచ్చినాడు? ఎచటికేగుచున్నాడు? అతడు ఎవనికి సంబంధించినవాడు?- అను విషయములను బాగుగ యోచించవలెను. తత్త్వమును బాగుగనెఱింగి, భ్రాంతిని విడనాడి, దేహాభిమానమును వదలి, బంధ్వాదులందు మమత్వ మును పారద్రోలి శాశ్వత పరమాత్మను తెలిసికొనుటకై జీవితమును వినియోగించవలెను.

---

* భ్రాన్తః - పాఠాంతరము (పొరబడితివి - అని భావము)

సత్సఙ్గత్వే నిస్సఙ్గత్వం
నిస్సఙ్గత్వే నిర్మోహత్వమ్
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః. **10**

తా॥ సజ్జన సాంగత్యముచే సంసారమందు నిస్సంగత్వము కలుగును. నిస్సంగత్వముచే మోహము (అజ్ఞానము) అంతరించును. మోహము అంతరించుటచే ఆత్మతత్త్వమందు నిలకడ కలుగును. అట్టి నిశ్చల తత్త్వముచే జీవన్ముక్తి లభించును.

వ్యాఖ్య :- ఆధ్యాత్మిక క్షేత్రమందు సత్సాంగత్యమున కెంతయో ప్రాముఖ్యత కలదు. అనుభవజ్ఞులగు మహాత్ములయొక్క సాంగత్యముచే ప్రపంచముయొక్క వాస్తవస్థితి తెలియగలదు. దానిచే సంసారభ్రాంతి పటాపంచలైపోవును. అత్తఱి ధనధాన్యాదుల యెడల, దారాపుత్రాదుల యెడల, ప్రాపంచిక వ్యవహారముల యెడల నిస్సంగత్వము కలుగును. అట్టి నిస్సంగత్వముచే అజ్ఞానము తొలగిపోయి జీవన్ముక్తి సిద్ధించును. కావున జనులకు సత్సాంగత్యమెంతయో అవసరమైయున్నది.

వయసి గతే కః కామవికారః
శుష్కే నీరే కః కాసారః
క్షీణే విత్తే కః పరివారో
జ్ఞాతే తత్త్వే క స్సంసారః. **11**

తా॥ యౌవనము గడచిన పిమ్మట కామ వికారమెచట? నీరు ఎండిపోవ ఇక చెఱువు ఎచట? ధనము తగ్గిపోగా ఇక పరిజన మెచట? తత్త్వజ్ఞానము కలిగిన పిమ్మట (ఆత్మతత్త్వము తెలిసికొనిన మీదట) ఇక సంసారబంధ మెచట? (అవి ఉండవని భావము)

వ్యాఖ్య :- వయస్సు మళ్ళిన తరువాత ఇంద్రియములు క్షీణదశను పొందునపుడు కామవికారములు తగ్గుట సహజమైనను, వయస్సునందున్నప్పుడే ఆ కామ వికారములను జయించుట విజ్ఞుల కర్తవ్యము. అదియే ఇంద్రియ నిగ్రహము. దాని వలననే మనోజయము, తద్వారా ఆత్మసాక్షాత్కారము సిద్ధించును. వార్థక్యమున ఇంద్రియ దుర్బలత్వముచే కామవేగము తగ్గినను కామవాసన మాత్రము ఉండియే యుండును. దానిని విచారణ చేత, వైరాగ్యముచేత, తత్త్వజ్ఞానముచేత పోగొట్టుకొనవలెను. తత్త్వ విచారణచే ఆత్మానుభూతి సిద్ధించును. దానిచే సంసార దుఃఖము తొలగిపోవును. కావున ముముక్షువులు ఇంద్రియ నిగ్రహము కలవారై తత్త్వవిచారణ గావించి, పరమశాంతిని, దుఃఖ రాహిత్యమును పొందవలెను.

మా కురు ధన జన యౌవన గర్వం
హరతి నిమేషాత్కాల స్సర్వమ్
మాయామయమిద మఖిలం హిత్వా
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా. 12

తా॥ ధనము, పరివారము, యౌవనము- ఇవి కలవని గర్వించకుము. ఏలయనిన, ఒక్క నిమిషములో కాలము వాని నన్నింటిని హరించివేయగలదు. దృశ్యపదార్థములన్నియు మాయామయములు, అశాశ్వతములు. కావున వాటిని త్యజించి, శాశ్వతమగు బ్రహ్మమును తెలిసికొని అందు ప్రవేశించుము (బ్రహ్మైక్యమును బడయుము).

వ్యాఖ్య :- కొందఱు తమ ధనమును చూచి, పరిజనమును చూచి, యౌవనమును చూచి గర్వించుచుందురు. అట్టి గర్వము అజ్ఞానజన్యమే యగును. ఏలయనిన ఆ ధనాది పదార్థము లన్నియు మాయామయములు. అవి మూణ్ణాళ్ళ ముచ్చటలే యగును. రెప్పపాటుకాలమున అవియన్నియు కాలగర్భమున విలీనములై పోగలవు. కావున విజ్ఞుడగువాడు నశ్వరప్రాపంచిక వైభవములకై ప్రాకులాడక వాటియెడల ఆసక్తినుంచక శాశ్వత పరమాత్మను చక్కగా తెలిసికొని, అట్టి ఆత్మతో ఐక్యమొంది, పరమ శాంతిని బొందవలెను.

దినయామిన్యౌ సాయంప్రాతః
శిశిరవసన్తౌ పునరాయాతః
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః
తదపి న ముఞ్చత్యాశావాయుః. 13

తా॥ పగళ్ళు, రాత్రి గడచిపోవుచున్నవి. సాయంకాల ప్రాతః కాలములు వచ్చుచు పోవుచున్నవి. శిశిర ఋతువులు, వసంత ఋతువులు ఎన్నియో గడచిపోవుచున్నవి. ఈ ప్రకారముగ కాలచక్రము రివ్వున తిరుగుచున్నది. ఆయుస్సు తరిగిపోవుచున్నది. అయినను ఆశ యను గాలి జనులను వదలకయే యున్నది.

వ్యాఖ్య :- కాలచక్రము అతివేగముగ తిరుగుచున్నది. దినములు, పక్షములు, మాసములు, సంవత్సరములు ఎన్నియో గడచిపోవుచున్నవి. ఆయుస్సు దినదినము క్షీణించుచున్నది. గడచి పోయిన కాలము తిరిగిరాదు. మానవజన్మ బహు దుర్లభమైనది. మహత్తర పుణ్య మను మూల్యమును చెల్లించి అట్టి విలువైన జన్మను జీవుడు పొందియున్నాడు. కావున అద్దానిని నశ్వర ప్రాపంచిక పదార్థములకొఱకు ధారబోయక శాశ్వత పరమాత్మ ప్రాప్తికొఱకై వినియోగించ వలెను. ఆశాది దుర్గుణములను ప్రయత్నపూర్వకముగ పోగొట్టుకొని, నిర్మల చిత్తము కలవాడై బ్రహ్మైక్యమును పొంది జీవితమును కడతేర్చుకొనవలెను.

ద్వాదశమఞ్జరికాభిరశేషః
కథితో వైయాకరణస్యైషః
ఉపదేశోఽ భూద్విద్యానిపుణైః
శ్రీమచ్ఛఙ్కరభగవచ్ఛరణైః. 14

తా॥ పండ్రెండు శ్లోకములను పుష్పగుచ్ఛములతో కూడిన ఈ సమస్త శాస్త్రసారభూతమగు ఉపదేశమంతయు సకల విద్యా ప్రవీణులైనట్టి శ్రీశంకరాచార్యులవారిచే వ్యాకరణ పండితునకు చెప్పబడెను.

వ్యాఖ్య :- పల్లవివంటిదైన మకుటశ్లోకమగు 'భజగోవిన్దమ్.' అను శ్లోకము, చివరి శ్లోకమున్నుకాక, మధ్యలో పండ్రెండు శ్లోకములను శ్రీశంకరులు బోధించిరి. కావున ఇది ద్వాదశమంజరికా స్తోత్రమని విఖ్యాతిగాంచినది. ఈ శ్లోకములకు మోహముద్గర మనియు పేరు కలదు. ముద్గర మనగా సమ్మెట, మోహ మనగా అజ్ఞానము. జనుల అజ్ఞానమును నిర్మూలించుటకు ఈ బోధ సమ్మెటదెబ్బవలె పనిచేయునని భావము. ముముక్షువులగు జిజ్ఞాసువులందఱును సకల శాస్త్ర సారభూతములగు ఈ శ్లోకములను భక్తిశ్రద్ధలతో పఠించి, భావమును లెస్సగ మననము చేసి ఆచరించి తరింతురుగాక! భవరోగమునకు దివ్యౌషధము వంటి ఈ శంకర భగవద్భాషణమును నిత్యజీవితమునందు కార్యాన్విత మొనర్చుకొని జనులు పరమశాంతిని బడయుదురు గాక!

హరిః ఓమ్ తత్ సత్

కా తే కాన్తా ధనగత చిన్తా
వాతుల కిం తవ నాస్తి నియన్తా
త్రిజగతి సజ్జన సఙ్గతి రేకా
భవతి భవార్ణవతరణే నౌకా. 15

తా॥ ఓయీ! నీకు యువతీ ధనాదులఁ గూర్చిన చింత ఏల? నీకు బోధించువాడు నిన్ను శాసించువాడు లేడా ఏమి? ముల్లోకములందును ఒక్క సజ్జన సహవాసమే సంసారసముద్రమును దాటుటకు నావయై యున్నది.

వ్యాఖ్య :- ఈ శ్లోకమును శ్రీ పద్మపాదాచార్యులవారు చెప్పిరి. శాంతిని, సుఖమును, బంధ రాహిత్యమును అభిలషించువాడు శాశ్వతమగు పరమాత్మనే ఆశ్రయించి, భక్తి జ్ఞాన వైరాగ్యములు కలవాడై భగవద్ధ్యానాదులను కావించుచుండవలెనేకాని వనితా ధనాది ప్రాపంచిక పదార్థములఁ గూర్చిన చింతలందు నిమగ్నుడు కారాదు. శాస్త్రములన్నియు ఆ విధముగనే బోధించుచున్నవి. మహనీయుల అనుభవపూర్వకవాక్యములున్ను ఆ విధముగనే యున్నవి. కావున దృశ్యపదార్థచింతను పారద్రోలి మనుజుడు దైవధ్యానతత్పురుడు కావలెను. మహాత్ముల యొక్క సాంగత్యమొకటియే ఈ ముల్లోకములందును సంసార సముద్ర తరణమునకు నావయై యున్నది. కావున జనులు సత్సాంగత్యము నవలంబించి తత్త్వమును గ్రహించి తద్రీతి ఆచరించి తరించవలెను.

జటిలో ముణ్డీ లుఞ్చిత కేశః
కాషాయామ్బర బహుకృతవేషః
పశ్యన్నపి చ న పశ్యతి మూఢో
హ్యుదరనిమిత్తో బహుకృతవేషః 16

తా॥ అజ్ఞాని జడలు పెంచుకొనినను, బోడితల కలవాడై నను, రకరకములుగా జుట్టు కత్తిరించుకొనినను, కాషాయ వస్త్రము ధరించినను, పలు విధములుగా వేషములు వేసినను, బ్రహ్మమయమగు ఈ జగత్తును చూచుచున్నను, పరమార్థ సత్యమును తెలిసికొనకయే యున్నాడు. అత్తటి అతడు పలు రకములుగ వేయువేషములన్నియు పొట్టకూటికొఱకు మాత్రమే యగునుగాక! అని ఈ శ్లోకాన్ని తోటకాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- ఆధ్యాత్మిక సాధనలవలననే భగవంతుడు తెలిసి కొనబడునుకాని, పైపై వేషములవలనకాదు. కాషాయవస్త్రధారణా దులు సన్న్యాసాద్యాశ్రమస్థుల బాహ్యచిహ్నములేకాని, అవి మోక్ష మునొసంగుటకు సమర్థములుకావు. జ్ఞానము లేనివాడు బ్రహ్మ మయమగు ఈ ప్రపంచమును చూచినను వాస్తవతత్త్వమును ఎఱుగ జాలకుండును. కావున ఎట్టి వస్త్రమును ధరించినను, ఎట్టి ఆకృతిని వహించినను, ఇంద్రియనిగ్రహ, మనస్సంయమాది సాధనలను గావించినపుడే మోక్షము లభించునుగాని అవి కావించనిచో లభించదు. అత్తటి ఆ బాహ్యవేషములన్నియు నిరు పయోగములే యగును. అవి ఉదర పోషణనిమిత్తమే కాగలవు.

అఙ్గం గలితం పలితం ముణ్డం
దశనవిహీనం జాతం తుణ్డమ్,
వృద్ధో యాతి గృహీత్వా దణ్డం
తదపి న ముఞ్చత్యాశా పిణ్డమ్. 17

తా॥ శరీరము ముడుతలు పడినను, తల నెరసిపోయి నను, పండ్లు ఊడిపోయినను, కఱ్ఱపట్టుకొని నడుచుచున్నను ముసలివానికి ఆశవదలుటలేదు. ఈశ్లోకమును హస్తామలకా చార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- వార్ధక్యమున శరీరము కృశించి, వికృతరూపమును ధరించును. అనగా స్థూలశరీరము శైథిల్యమునొందును. కాని సూక్ష్మశరీరములో అనగా మనస్సునందు- ప్రయత్నము చేయ నిచో, సాధన ఒనర్చనిచో మార్పు ఏమియు కలుగదు. కనుకనే వృద్ధునకు శరీరము పక్వమగునేకాని మనస్సు యథారీతి మార్పు లేకయుండును. ఎక్కడున్న గొంగళి అక్కడే యుండును. ఆశ తగ్గదు. కోరికలు విజృంభించుచునే యుండును. కాబట్టి సాధనాతి శయముచే అశుభవాసనలను, ఆశాదిదోషములను ప్రయత్న పూర్వకముగ అరికట్టవలెను.

అగ్రే వహ్నిః పృష్ఠే భానూ
రాత్రౌ చుబుకసమర్పితజానుః
కరతలభిక్ష స్తరుతల వాస
స్తదపి న ముఞ్చత్యాశాపాశః. 18

తా॥ ముందుభాగమున అగ్నిహోత్రము, వెనుక భాగమున సూర్యుడు కలిగియుండి, రాత్రిళ్ళు చలిపోగొట్టు కొనుటకొఱకై మోకాళ్ళు గడ్డమునకు ఆనించి ముడుచుకొని పరుండుచు, కరతలభిక్షను స్వీకరించుచు, చెట్టుక్రింద నివసించుచు ఉన్నప్పటికిని ఆశయను త్రాటిని వదలుటలేదు, (ఆహా! ఆశ్చర్యము!) ఈ శ్లోకమును సుబోధాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- కొందఱు గృహమును పరిత్యజించి కుటుంబమును వదలివైచి ఏకాంతమున ఏ చెట్టుక్రిందనో నివసించుచు, భిక్షాటనముచే జీవికను కొనసాగించుచు ఉందురు. కాని ఆశమొదలైన దోషములు వారిని వదలకయే యుండును. మోక్షమునకు కావలసినది బాహ్య వస్తుత్యాగముకాదు. అభ్యంతర వాసనాత్యాగము, దుర్గుణత్యాగము, అరిషడ్వర్గత్యాగము, మానసికదోషత్యాగము. అదిలేకున్న కేవలము గృహాదిబాహ్యవస్తు త్యాగము మానవుని బంధవిముక్తికి ఉపకరించదు. పైగా అమూల్యమైన మానవ జీవితము నిరుపయోగముగ గడచినట్లు కాగలదు. కావున విజ్ఞుడగువాడు ఎక్కడున్నను తన హృదయశుద్ధిని జాగ్రతగా కాపాడుకొనుచుండవలెను.

కురుతే గఙ్గా సాగరగమనం
వ్రతపరిపాలనమథవా దానమ్,
జ్ఞాన విహీన స్సర్వమతేన
ముక్తిం న భజతి జన్మ శతేన. 19

తా॥ గంగాది పవిత్ర నదులందును, సముద్రమందును స్నానమాచరించినప్పటికిని, వ్రతములను పరిపాలించి నప్పటికిని, దానములను చేసినప్పటికిని ఆత్మజ్ఞానము లేనిచో నూఱు జన్మలకైనను మనుజునకు మోక్షము లభించదు. ఇది సర్వమత సమ్మతము, ఈ శ్లోకమును సురేశ్వరాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- తత్త్వజ్ఞానము చేతను, ఆత్మానాత్మ వివేకము చేతను, జీవుడు తాను పాంచభౌతికమైన జడమగు దేహము కాదనియు, నిత్యశుద్ధ బుద్ధముక్తమగు ఆత్మయే యనియు బాగుగ గుర్తెఱిగి అట్టి స్వస్వరూపమున నిలుకడ కలిగియుండును. అదియే మోక్షము. అట్టి విజ్ఞానము లేనిచో కేవలము స్నానాదులచే ముక్తి ఎన్నటికిని లభించదు. కావున మనుజుడు ప్రయత్న పూర్వకముగ ఆత్మానాత్మవివేకమును సంపాదించవలెను. అయితే గంగా స్నానాదులును, వ్రతాదులును నిరుపయోగములని తలంప రాదు. వాని ద్వారా పుణ్యసంపాదనమును, చిత్తశుద్ధిని బడసి ఆత్మజ్ఞానోత్పత్తికి తగిన క్షేత్రమును తయారుచేసికొనవలెను. అట్లు చేసికొననిచో కేవల స్నానాదులవలన పెద్ద ప్రయోజనము ఉండదు.

సురమన్దిర తరుమూల నివాస
శ్శయ్యా భూతలమజినం వాసః,
సర్వ పరిగ్రహ భోగత్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః. 20

తా॥ దేవాలయ ప్రాంగణమునగల చెట్టుక్రింద నివాసము చేయుచు, భూమినే శయ్యగా ఉపయోగించుకొనుచు, జింకచర్మమునే వస్త్రముగా ధరించుచు, సర్వవస్తు పరిగ్రహణమును త్యజించి, భోగములను వదలివైచి, వైరాగ్యమునవలంబించి భగవంతుని ధ్యానించుచుండ ఎవనికి సుఖము కలుగకుండును?

ఈ శ్లోకమును నిత్యానందాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- దృశ్యవస్తు పరిత్యాగము, దృక్స్వరూప సాక్షాత్కారము- అను ఈ రెండును పూర్ణసుఖమునకు, శాంతికి కారణభూతములైయున్నవి. బాహ్యవస్తువులను గూర్చిన సంకల్పమును విడనాడి, మనస్సును అంతర్ముఖమొనర్చి ఆత్మచింతన చేయువారికి మహత్తర సుఖము సంప్రాప్తించును. అట్టి ఆత్మసుఖమును బడయుటయే జీవిత లక్ష్యము, కావున వైరాగ్యము, ఆత్మచింతన అనునివి పరమ సుఖానుభూతికి ముఖ్యకారణములై యున్నవి. అందుచే పరిపూర్ణసుఖము నభిలషించువాడు అట్టి వైరాగ్యాదులను తప్పక ఆశ్రయించవలసియుండును.

యోగరతో వా భోగరతో వా
సంగరతో వా సంగవిహీనః,
యస్య బ్రహ్మణి రమతే చిత్తం
నన్దతి నన్దతి నన్దత్యేవ. 21

తా॥ ఎవనియొక్క చిత్తము పరబ్రహ్మమునందు (ఆత్మయందు) నిలకడకలిగియుండునో, అట్టివాడు యోగయుక్తుడుగ నుండినను, భోగయుక్తుడుగనుండినను, సంగయుక్తుడుగ నుండినను, సంగరహితుడుగనుండినను, ఆనందమునే ముమ్మాటికిని పొందుచుండును. ఈ శ్లోకమును ఆనన్దగిరి ఆచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- పరిపూర్ణమగు ఆనందము బ్రహ్మమునందే కలదు. ఆత్మయందే కలదు. అట్టి బ్రహ్మమునందు స్థితిగలిగియున్నవాని ఆనందమును బాహ్యపరిస్థితులెవ్వియు చలింపచేయజాలవు. అతడు యోగయుక్తుడైనను, భోగయుక్తుడైనను, బంధ్వాదులతో గాని, ప్రాపంచిక పదార్థములతోగాని కూడియున్నను, లేక కూడక యున్నను అతని ఆనందమునకు ఏ మాత్రము లోటువుండదు. ఇచ్చట భోగమునకు అజ్ఞానులనుభవించు భోగములని అర్థము చెప్పరాదు. ఏలయనగా జ్ఞానికి ప్రాపంచిక భోగములందాసక్తి ఉండనే ఉండదు. స్వాదిష్టమగు ఆహారము, సుందర భవనములు మున్నగునవి యని చెప్పవచ్చును. బ్రహ్మానందానుభూతిని బడయుటయే జీవితపరమావధి. అద్దాని కొఱకై మనుజుడు సర్వ విధముల ప్రయత్నించవలెను.

భగవద్గీతా కించిదధీతా
గంగాజలలవ కణికా పీతా,
సకృదపి యేన మురారి సమర్చా
క్రియతే తస్య యమోఽపి న చర్చామ్. **22**

తా॥ ఎవడు భగవద్గీతను కొంచెమైనను అధ్యయనము చేయునో, గంగాజలమును ఒకింతైనను పానము చేయునో, ఒక్క పర్యాయమైనను భగవంతుని పూజించునో, అట్టి వానిని గూర్చి యముడు కూడ చర్చింపడు. ఈ శ్లోకమును దృఢ భక్తాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- చెడ్డపనులు చేసినవానిని గూర్చి, పాపమును ఆర్జించినవారినిగూర్చియే యముడు చర్చించి వారికితగు శిక్ష విధించును. అంతియే కాని మంచివారి జోలికి యముడు పోడు. భగవద్గీతను చదువుట, గంగా తీర్థమును పానము చేయుట. భగవంతుని అర్చించుట, ధ్యానించుట మొదలగునవి సత్కార్యములు. అట్టివానిని ఆచరించు పుణ్యాత్ములకడకు యముడేల పోవును? పోనేరడు. కావున విజ్ఞుడగువాడు తన జీవితమందేలాటి పాప కృత్యములను చేయక, గీతాపఠన, భగవద్ధ్యాన, గంగాజల సేవనాది పుణ్యకార్యములనే ఆచరించుచు జన్మసార్థకత నొందవలెను. అవతారమూర్తియగు శ్రీకృష్ణపరమాత్మయొక్క ముఖారవిందము నుండి వెలువడిన దివ్యప్రబోధమగుటచే భగవద్గీత మహా పవిత్రమైనది. కావున ముముక్షువులద్దానిని మఱువరాదు. ఈ శ్లోకము ద్వారా భగవద్గీత యొక్క ప్రాముఖ్యత లెస్సగ వెల్లడియగు చున్నది.

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనమ్,
ఇహ సంసారే బహుదుస్తారే
కృపయా పారే పాహిమురారే. **23**

తా॥ మరల మరల పుట్టుట, మరల మరల చచ్చుట, మరల మరల తల్లి గర్భమునందు పరుండుట-మున్నగు బాధలతో కూడిన ఈ అపార దుస్తర సంసార సముద్రము నుండి ఓ పరమాత్మా! దయతో రక్షింపుము! ఈ శ్లోకమును నిత్యనాథాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- సంసారము మహాసముద్రము వంటిది, అపారమైనది. పలు దుఃఖములతో కూడినది. పుట్టుట, చచ్చుట, తల్లి గర్భమందు తొమ్మిది మాసములు నివసించుట, మున్నగు పెక్కు యాతనలు గలిగియున్నది. దీనినుండి తప్పించుకొనుటకు భక్తి, జ్ఞాన, వైరాగ్యాది సాధన సహితమగు స్వప్రయత్నముతో బాటు భగవంతుని కరుణకూడ అవసరమైయున్నది. కావున అద్దాని కొఱకై సర్వేశ్వరుని మనఃపూర్వకముగ ప్రార్థించవలెను. ఘోర సంసార బంధము నుండి రక్షింపుమని వేడుకొనవలెను. మాయను దాటుటకు మాయాధీశుడైన భగవానుని కృపాకటాక్షమెంతయో అవశ్యకమై యున్నది. జననమరణాది సంసార బాధలనుగూర్చి యోచించి, వానినుండి తప్పించుకొనుటకై ముముక్షువు, ఆత్మ విచారణ, భగవత్ప్రార్థన మున్నగువానిని ఆచరించవలెను.

రథ్యా కర్పట విరచిత కన్థః
పుణ్యాపుణ్య వివర్జిత పన్థాః
యోగీ యోగనియోజిత చిత్తో
రమతే బాలోన్మత్తవదేవ. **24**

తా॥ వీధులందు పడియున్న గుడ్డప్రేలికలచే సమకూర్చ బడిన బొంతకలవాడును, పుణ్యాపుణ్యములకు అతీతమైన ఆత్మమార్గమున సంచరించువాడును, ఆత్మయందు నియోగింపబడిన చిత్తము కలవాడును అగు యోగి బాలునివలెను, ఉన్మత్తునివలెను తనలో తాను ఆనందించుచుండును. (ఆత్మానందమును బడయు చుండును) ఈ శ్లోకము యోగానందాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- ఆత్మధ్యాన తత్పరుడగు యోగికి బాహ్యవస్తువు లందపేక్ష యుండదు, కావున తాను ధరించు వస్త్రాదుల విషయమై పట్టించుకొనడు. వీథిలో పడియున్న పాత గుడ్డ ప్రేలికలను జోడించి, బొంతగా చేసికొని దానిని వాడుకొనును. అతని దృష్టి పుణ్యపాపములకు అతీతమై యుండును. ద్వంద్వాతీతమై యొప్పును. అతని మనస్సు నిరంతరము యోగయుక్తమై యుండును. అతడు సదా ఆత్మానంద నిమగ్నుడై యుండును. కనుకనే బాలునివలె, ఉన్మత్తునివలె ప్రపంచ దృష్టిలేక తనలో తాను ఆనందించు చుండును. ఆత్మానందము-బ్రహ్మానందము ప్రపంచములోని అన్ని ఆనందములకంటెను చాల గొప్పది. మహోన్నత ఆనందమును బడయుటకై జనులు ప్రయత్నించవలెను.

కస్త్వం కోఽహం కుత ఆయాతః
కా మే జననీ కో మే తాతః,
ఇతి పరిభావిత నిజసంసార :
సర్వం త్యక్త్వా స్వప్న విచారః. **25**

తా॥ నీవెవడవు? నేనెవరిని? మనమెచటి నుండి వచ్చితిమి? నా తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు?- అని ఈ ప్రకారముగ సంసారమును గూర్చి విచారించి, ఇదియంతయు స్వప్నమువలె అసత్యమని యెఱిఁగి ఆ యా దేహాది పదార్థములపై వ్యామోహమును విడనాడి సత్యమగు పరమాత్మ నాశ్రయించవలెను. ఈ శ్లోకమును సురేంద్రాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- ఈ దృశ్యప్రపంచమంతయు స్వప్నమందు వలె మనస్సుచే కల్పింపబడినది. కాబట్టి వాస్తవమగు ఉనికి దానికి లేదు. అది పరమార్థ దృష్టియందు స్వప్నపదార్థములవలె మిథ్య అయి యున్నది. కాబట్టి ఈ దేహాదులు ఎచటినుండి వచ్చినవి? తిరిగి ఎచటికి పోవును? నాయొక్క నిజస్వరూపమెద్ది? అని విజ్ఞుడగువాడు బాగుగ విచారణ చేసి, ఇది యంతయు ఇంద్రియ మనఃకల్పితమని గుర్తెఱిఁగి దేహాది ప్రాపంచిక దృశ్యపదార్థములపై మమత్వమును, వ్యామోహమును విడనాడి, శాశ్వతమై, సత్యమై నట్టి స్వస్వరూప పరమాత్మను ఆశ్రయించి, బంధవిముక్తుడు కావలెను. పరమానందమును అనుభవించవలెను.

త్వయి మయి సర్వత్రైకో విష్ణుః
వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః,
భవ సమచిత్తస్సర్వత్ర త్వం
వాఞ్ఛ స్యచిరాద్యది విష్ణుత్వం. **26**

తా॥ నీయందు, నాయందు, అంతటను ఒకే భగవంతుడు వ్యాపించియున్నాడు. అయినను నా యెడల అసహనము కలిగి వ్యర్థముగ నన్ను కోపగించుచున్నావు, నీవు దైవత్వమును శీఘ్రముగా వాంఛించెదవేని సర్వత్ర సమబుద్ధి కలవాడవు (సర్వం విష్ణు మయం అను భావము కలవాడవు) కమ్ము. ఈ శ్లోకమును మేధాతిథి ఆచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- 'అభేదదర్శనం మోక్షః, సంసారో భేద దర్శనమ్' అనునట్లు అభేదబుద్ధియే మోక్షము, భేదబుద్ధియే బంధము. భగ వానుడు- పరమాత్మ సమస్త చరాచర ప్రాణికోట్లయందును సమముగ వ్యాపించియున్నాడు. ఈ సత్యమును తెలిసినవాడు మఱి యొకనిని ఏల ద్వేషించును? మఱియొకనిని ఏలకోపగించును? సమరసజ్ఞానము లేకపోవుటయే ఈ కోపతాపాలకు కారణము. భగవంతునియొక్క సర్వవ్యాపకత్వము తెలియకపోవుటయే ఈ భేద బుద్ధికి, అసహనమునకు కారణము. కాబట్టి పుష్పమాలలో దారమువలె భగవంతుడు సర్వత్ర సమముగ వెలయుచున్నాడని తెలిసికొని మనుజుడు తనపైవలె ఇతరుల యెడలకూడ ప్రేమ, దయ కలిగి యుండవలెను. ఈ సమభావమే జీవునకు క్రమముగ దైవత్వమును కలుగజేయును. కావున జనులు సమదృష్టిని పెంపొందింపజేసికొనవలెను.

కామం క్రోధం లోభం మోహం
త్యక్త్వాత్మానం పశ్యతి సోఽహం
ఆత్మజ్ఞానవిహీనా మూఢాః
తేపచ్యన్తే నరకనిగూఢాః. **27**

తా॥ కామమును, క్రోధమును, లోభమును, మోహమును విడిచినచో, అనగా మనస్సునందలి వికారములను త్యజించినచో జీవుడు 'సోఽహం' భావము ద్వారా అనగా 'ఆ పరమాత్మయే నేను' అను నిశ్చయముద్వారా తన ఆత్మను చూడగలుగు చున్నాడు. అట్టి ఆత్మజ్ఞానములేని వారు అజ్ఞానులు, నరకమునబడి నానాబాధల నొందుదురు. ఈ శ్లోకమును భారతీవంశాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- జీవునకు అంతశ్శత్రువులు ఆఱుమంది కలరు. వారే కామ, క్రోధ, లోభ, మోహాదులు. జీవుని మోక్షప్రాప్తికి వారు గొప్ప ప్రతిబంధములను కలుగజేయుదురు. ఏ క్షణమందు వారిని మనుజుడు జయించునో, వాని నెల్లను త్యజించివైచునో, ఆ క్షణ మందే అతడు 'సోఽహం' భావముద్వారా అనగా 'ఆ పరమాత్మయే నేను' అను నిశ్చయముద్వారా ఆత్మను సాక్షాత్కరించుకొనుచున్నాడు. ఆత్మానుభూతిని బడయుచున్నాడు. కాబట్టి కామాది ఆవరణములను తొలగించుకొని జీవుడు స్వస్వరూపాత్మను పొంది ముక్తుడు కావలయును. లేకున్న, అజ్ఞాన వశమున జీవుడు సంసారబంధమున తగుల్కొని నరకమున బడి నానాయాతనల నొందుచుండును. కాబట్టి విజ్ఞుడగువాడు కామాదులను శీఘ్రముగ జయించి ఆత్మజ్ఞానమును బడసి తరించవలెను.

గేయం గీతా నామ సహస్రం
ధ్యేయం శ్రీపతిరూపమజస్రమ్
నేయం సజ్జన సఙ్గతి మనిశం
దేయం దీనజనాయ తు విత్తమ్. 28

తా॥ భగవద్గీతను, విష్ణుసహస్రనామములను గానము చేయవలెను. భగవంతునియొక్క స్వరూపమును ఎల్లపుడు ధ్యానము చేయవలెను. సత్సాంగత్యమందు చిత్తమును ప్రవేశ పెట్టవలెను. బీదలకు దాన ధర్మములను చేయవలెను. ఈ శ్లోకమును సుమతాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :– ముముక్షువులకు శాస్త్రాధ్యయనము చాల ముఖ్య మైనది. కావున సర్వశాస్త్రసారమగు భగవద్గీతను, విష్ణుసహస్ర నామములను ప్రతిదినము పఠించుచు, అందలి భావములను లెస్సగ మననముచేయవలెను. ప్రతిదినము భగవంతుని ధ్యానించు చుండవలెను. మనస్సును దృశ్యపదార్థములవైపునకు పరుగిడనీయక, అంతర్ముఖమొనర్చి పరమాత్మయందు సదా నెలకొల్పవలెను. అనుభవజ్ఞులగు మహాత్ముల సాంగత్యముచే ఎంతయో పరమార్థలాభము చేకూరును. కావున అట్టి సత్సాంగత్యమును ముముక్షువు తప్పక అవలంబించవలయును. మఱియు శక్తికొలది బీదలకు, అనాథలకు, ధనమును, అన్నాది పదార్థములను ఒసంగుచుండవలెను. దానాదులచే మనుజునకు పుణ్యము లభించును. దానిచే చిత్తశుద్ధి, తద్ద్వారా ఆత్మజ్ఞానము చేకూరును.

శత్రౌ మిత్రే పుత్రే బంధౌ
మా కురు యత్నం విగ్రహసంధౌ.
సర్వస్మిన్నపి పశ్యాత్మానం
సర్వత్రోత్సృజ భేదాజ్ఞానమ్. 29

తా॥ శత్రువుతోగాని, మిత్రునితోగాని, పుత్రునితోగాని, బంధువులతో గాని కలహాదులకు ప్రయత్నించకుము. అందఱి యందును ఆత్మనే వీక్షింపుము. భేదరూపమైన అజ్ఞానమును సర్వత్ర త్యజించి వేయము. ఈ శ్లోకమును శ్రీ శంకరాచార్యుల వారు చెప్పిరి.

వ్యాఖ్య :– పుష్పమాలలో దారమువలెను, బల్బులలో కఱెంటు వలెను, సమస్త చరాచర ప్రాణికోట్లయందును భగవంతుడు వ్యాపించియున్నాడు. కావున ఎవరితోను కలహించరాదు. అంతట ఆత్మయే వెలయుచుండ, ఇక ఒకరిని కోపగించినచో, బాధించినచో తన్నుతాను బాధించుకొనినట్లగును. కావున వైమనస్యము, విరోధము ఎన్నడును అవలంబించరాదు. భేద బుద్ధిని విడనాడవలెను. సర్వత్ర అభేదాత్మదర్శనమును గావించ వలెను. తరించుటకు, శాంతిని బడయుటకు ఇట్టి అభేదదర్శనమే హేతువైయున్నది. అంతట ఆత్మయే ప్రకాశించుచున్నందువలన ప్రాణికోట్ల యెడల ప్రేమ, దయ కలిగియుండవలెను.

సుఖతః క్రియతే కామాభోగః
పశ్చాద్ధన్త శరీరే రోగః,
యద్యపిలోకే మరణం శరణం
తదపి న ముఞ్చతి పాపాచరణమ్. 30

తా॥ సుఖాపేక్షతో కామభోగముల ననుభవించుదురు. కాని తదుపరి శరీరము రోగగ్రస్తమగుచున్నది. ప్రపంచమున చావు అనునది తథ్యమై యున్నప్పటికి జనులు పాపా చరణమును వదలకయే యున్నారే. ఆహా! ఆశ్చర్యము. ఈ శ్లోకము నుండి 33 శ్లోకం వరకు శ్రీ శంకరాచార్యులవారు చెప్పిరి.

వ్యాఖ్య :- వాస్తవముగ సుఖము బయటలేదు. బయట ఉన్నది సుఖముయొక్క అభాసమే, ప్రతిబింబమే. వస్తువులనుండి సుఖ మెన్నటికిని రాదు. సుఖము ఆత్మయందేకలదు. ఈ రహస్యము తెలియక అజ్ఞాని దృశ్యపదార్థములలో ఆనందము కలదని భ్రమించి వానివెంట ఉరుకుచున్నాడు. ఫలస్వరూపముగ, పూర్ణ సుఖము వానివలన లభించకపోగా, పైపెచ్చు రోగాదుల వలన అశాంతిని కొనితెచ్చుకొనుచున్నాడు. (భోగే రోగ భయం) కావున భోగములను పరిత్యజించి యావచ్ఛక్తిని ఆత్మానుభూతిని బడయుటకే వినియోగించ వలెను. మృత్యువు పొంచియున్నది. ఏ క్షణమందైనను అది జీవుని శరీరమును కబళించి వేయవచ్చును. కావున పాపాచరణమును వదలివైచి, భగవంతుని శరణుబొంది, భక్తి జ్ఞాన వైరాగ్యాది సాధనలకు వెనువెంటనే ఉపక్రమించి ఆత్మానుభూతిని బడయుటద్వారా జన్మసాఫల్యము నొందవలెను.

ప్రాణాయామం ప్రత్యాహారం
నిత్యానిత్యవివేక విచారమ్,
జాప్యసమేత సమాధి విధానం
కుర్వవధానం మహదవధానమ్. 31

తా॥ ప్రాణాయామము, ప్రత్యాహారము, నిత్యానిత్యవస్తు వివేకము, తత్త్వవిచారణ, మంత్ర జపము, గొప్ప ఏకాగ్రతతో కూడిన సమాధిస్థితి మున్నగు సాధనలను అవలంబించుము.

వ్యాఖ్య :- రాజయోగమునందు అష్టాంగ యోగసాధన చెప్పబడినది. ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి అనునవి ఆ అష్టాంగములలో చేరినవే అయి యున్నవి. ఆత్మసాక్షాత్కారమును బడయుటకు ఈ ఎనిమిది సాధనలు (యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు) చాల ఆవశ్యకములై యున్నవి. ప్రత్యాహారమనగా మనస్సును బాహ్యవస్తువులనుండి మరలించి, అంతర్ముఖమొనర్చి ఆత్మయందు స్థాపించుట. సమాధి అనునది చిట్టచివరిస్థితి. దానిని బడయుటకు ఎంతయో ఏకాగ్రత అవసరమై యున్నది. కనుకనే పై శ్లోకమున 'అవధానమ్' (ఏకాగ్రత) అని రెండు పర్యాయములు చెప్పబడినది. సమాధి స్థితి యందు జీవునకు నిర్వికల్పాత్మానుభవము కలుగుట వలన పరమ శాంతి, ఆనందము లభించును, అదియే జీవితపరమావధి.

గురు చరణామ్బుజ నిర్భర భక్తః

సంసారా దచిరా ద్భవ ముక్తః,

సేన్ద్రియ మానస నియమా దేవం

ద్రక్ష్యసి నిజ హృదయస్థం దేవమ్. **32**

తా॥ గురువు యొక్క పాదపద్మములందు మనస్సును నెలకొల్పి గురుభక్తి కలవాడై, సంసారబంధనము నుండి శీఘ్రముగ విముక్తుడవు కమ్ము. ఇంద్రియములను, మనస్సును నిగ్రహించుటచేత మాత్రమే నీ హృదయమందున్న ఆత్మరూప పరమేశ్వరుని, దేవదేవుని చూడగలవు.

వ్యాఖ్య :- ఆధ్యాత్మిక క్షేత్రమున పురోగమించదలంచు వారికి గురుభక్తి, దైవభక్తి అత్యంతావశ్యకములై యున్నవి. వానిచే సాధకుడు అచిరకాలములోనే సంసార బంధనము నుండి విముక్తుడు కాగలడు. సాధకునకు భక్తితోబాటు ఇంద్రియ నిగ్రహము, మనోజయము కూడ అవసరములై యున్నవి. అట్టి ఇంద్రియ, మనస్సంయమములచే జీవుడు ఆత్మసాక్షాత్కారమును బడయగలడు. తన హృదయమందేయున్న పరమాత్మదేవుని గాంచగలడు. అదియే జీవుని చరమ లక్ష్యము. కావున భక్తిని, ఇంద్రియ నిగ్రహమును లెస్సగ సంపాదించి, తద్వారా ఆత్మానుభూతిని బడసి జన్మసార్థకత నొందవలయును.

మూఢః కశ్చన వైయాకరణో

డుకృఞ్ కరణాధ్యయన ధురీణః

శ్రీమచ్ఛఙ్కర భగవచ్ఛిష్యైః

బోధిత ఆసీచ్ఛోధిత కరణైః. **33**

తా॥ ఆత్మజ్ఞానము లేనివాడును, 'డుకృఞ్‌కరణే' అను వ్యాకరణ సూత్రమును వల్లెవేయుటయందు మాత్రము అగ్రేసరుడైన ఒకానొక వ్యాకరణ శాస్త్రజ్ఞుడు, శ్రీ శంకర భగవత్పాదుల చేతను, వారి శిష్యులచేతను ఈ విధముగ బోధింపబడి, అంతఃకరణమును శుద్ధపఱచుకొని తరించెను.

వ్యాఖ్య :- పూర్వము కాశీపట్టణమందు ఒకచోట కూర్చొని 'డుకృఞ్ కరణే' అను వ్యాకరణ సూత్రమును వల్లెవేయుచుండిన ఒకానొక వ్యాకరణ పండితునకు ఈ ప్రకారముగ శ్రీ శంకరాచార్యులవారు, వారి శిష్యవర్గము చక్కని ఆధ్యాత్మిక బోధలు చేయగా ఆ పండితుడు వానిని శ్రవణము చేసి, అంతఃకరణమును శుద్ధపఱచుకొని తరించెను. సంసార బంధవిముక్తిని బడయుటకు గురుబోధ పరమావశ్యకమైయున్నది. కనుక అనుభవజ్ఞుడగు సద్గురువును ఆశ్రయించి ఆత్మానాత్మ వివేకము బడసి, తరించు మార్గమును తెలిసికొని, ఆ ప్రకారమాచరించి ఆత్మశాంతిని, ఆత్మానుభవమును పొంది, పవిత్రమైన మానవ జీవితమును సఫలమొనర్చుకొనవలెను.

హరిః ఓం తత్ సత్

శ్రీ శుకబ్రహ్మాశ్రమ గ్రంథముల వివరములు

1.	గీతామకరందము (తెలుగు)	రూ. 200-00
2.	GITA MAKARANDA (English)	250-00
3.	గీతామకరందము (కన్నడం)	250-00
4.	గీతామకరందం (హిందీ)	150-00
5.	గీతామకరందం (తమిళం)	150-00
6.	యోగవాసిష్ఠరత్నాకరము	100-00
7.	రామాయణ రత్నాకరము	100-00
8.	భారత రత్నాకరము	100-00
9.	భాగవత రత్నాకరము	100-00
10.	ఉపనిషద్రత్నాకరము	80-00
11.	గీతోపన్యాసములు	50-00
12.	మోక్షసాధన రహస్యము	50-00
13.	పరమార్థకథలు	60-00
14.	బ్రహ్మచర్య విజయము	50-00
15.	అధ్యాత్మరామాయణము	18-00
16.	ఆత్మానుసంధానము	35-00
17.	బ్రహ్మానంద వైభవము	25-00
18.	భజనలు - కీర్తనలు	30-00
19.	శ్రీ వాసిష్టమహారామాయణము	35-00
20.	అమృత బిందువులు	25-00
21.	శ్రీమద్భగవద్గీత (స్థూలాక్షరి)	20-00
22.	నిత్యస్మరణీయము	20-00
23.	శ్రీమద్భగవద్గీత (మూలం)	8-00
24.	వివేకానంద సింహానాదము	30-00
25.	గీతా ముచ్చట్లు	15-00
26.	శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాముల జీవిత చరిత్ర	35-00
27.	యమలోకవార్తలు	10-00
28.	తత్త్వసారము	6-00
29.	మానసబోధ	6-00
30.	పాండవగీత	5-00
31.	ఆధ్యాత్మజడ్జిమెంటు	10-00
32.	ధ్యాన పద్ధతి	5-00
33.	వైరాగ్యసాధన	5-00
34.	దివ్యసూక్తులు	15-00
35.	మట్టిలో మాణిక్యము	5-00
36.	ప్రణవపూజ	4-00
37.	గౌరిపూజావిధానము	4-00
38.	ద్వాదశమంజరి	5-00
39.	మోక్షద్వారపాలకులు	5-00
40.	ఆత్మతత్త్వవిచారణ	5-00
41.	ఆధ్యాత్మికహితోక్తులు	5-00
42.	ఉపనిషత్కథలు	25-00
43.	గూఢార్థదీపిక (గీతకు మధుసూధన సరస్వతివారి వ్యాఖ్య) మూడు భాగాలు	150-00

ఆడియో కేసెట్స్

1.	శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి గీతోపన్యాసముల క్యాసెట్స్ ఎ) 18 అధ్యాయములు 18 కేసెట్స్ సెట్	500-00
2.	తత్త్వగీత-గానం శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు	35-00
3.	యతిగీత-గానం శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు	35-00
4.	గీతాపారాయణ కేసెట్స్ (3 కేసెట్స్ గల సెట్)	105-00
5.	తత్త్వసారము	35-00
6.	మానసబోధ	35-00
7.	గీతామృతం (శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారి గీతాప్రవచనం, ఆరు కేసెట్స్) ఒక్కొక్క అధ్యాయం	150-00

వీడియోకేసెట్స్

1.	శ్రీస్వాములవారి గీతోపన్యాసముల వీడియో కేసెట్స్ మొత్తము సెట్ (15 కేసెట్స్)	1,500-00

మాసపత్రిక

వేదాంతభేరి సంవత్సర చందా	50-00
శాశ్వత పోషకనిధి చందా	1116-00
సద్గురువాణి సంవత్సర చందా (త్రైమాసికం)	40-00
జీవితచందా	300-00

ప్రాప్తిస్థానము :

మేనేజరు, శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ కాళహస్తి-517 640,
ఫోన్: 08578- 222239

దైవప్రార్థన

కరుణామూర్తియగు దేవా!

మా చిత్తము సర్వకాల సర్వావస్థలయందును నీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము.

పరమ దయానిధీ!

ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువఱకును మనోవాక్కాయములచే మావలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుము.

సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా!

మా యంతఃకరణమునందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పము గాని, విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము.

వేదాన్తవేద్యా! అభయస్వరూపా!

మాయందు భక్తి జ్ఞాన వైరాగ్య బీజములంకురించి శీఘ్రముగ ప్రవృద్ధములగునట్లు ఆశీర్వదింపుము. మఱియు ఈ జన్మమునందే కడతేరి నీసాన్నిధ్యమున కేతెంచుటకు కావలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుము.

దేవా!

నీవు భక్తవత్సలుడవు. దీనులపాలిటి కల్పవృక్షస్వరూపుడవు. నీవు తప్ప మాకింకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిమి. అసత్తునుండి సత్తునకు గొనిపొమ్ము. తమస్సునుండి జ్యోతిలోనికి తీసుకొనిపొమ్ము. మృత్యువునుండి అమృతత్వమును పొందింపజేయుము. ఇదే మా వినతి. అనుగ్రహించుము. నీ దరిజేర్చుకొనుము.

పాహిమాం, పాహిమాం, పాహిమాం పాహి.





http://gitamakarandam.blogspot.in/